


జగన్ బొమ్మల బెడద



> గత సీఎం జగన్ రెడ్డి బొమ్మల పిచ్చి రైతులకు అష్టకష్టాలు తెచ్చి పెట్టింది. రూ. కోట్ల ప్రజాధనం ఖర్చు చేసిన ఈ విధానం మీద రైతులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. సర్వే అవకతవకలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జగనన్న భూరక్ష-భూహక్కు పేరుతో పొలాలను సర్వే చేసే కార్యక్రమాన్ని (ల్యాండ్ టైటిలింగ్ యాక్టు) 2022లో నాటి సీఎం జగన్ రెడ్డి ఎంతో ఘనంగా ప్రారంభించారు. పొలాలను కొలతలు వేసి తన బొమ్మతో రాళ్లు పాతడమే కాకుండా గతంలో ఉన్న పాసు పుస్తకాలను కూడా మార్చేసి తన బొమ్మతో భూహక్కు పత్రాలను రైతు చేతిలో పెట్టారు. ఈ జగనన్న భూసర్వే-భూరక్ష పథకానికి రాష్ట్రంలో దాదాపు రూ.700 కోట్లు ఖర్చుచేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు రూ.10 కోట్ల దాకా ఖర్చు చేశారు. ఈ సర్వే రాళ్లపై ముద్రించిన జగన్ బొమ్మను తొలగించే కార్యక్రమాన్ని ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టింది.



- ప్రచారం పిచ్చితో భూ సర్వే రాళ్లపై తన బొమ్మ ముద్రించుకున్న ఆనాటి సీఎం
- ఉమ్మడి జిల్లాలో నాలుగున్నర లక్షల సర్వే రాళ్లు
- ఒక్కోరాయి పాతడానికి రూ.150 చొప్పున తగలేసిన వైసీపీ ప్రభుత్వం
- జగన్ బొమ్మలు తొలగించేందుకు రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్న కూటమి ప్రభుత్వం

సర్వే రాళ్ల కోసం రూ.6 కోట్లు ఖర్చు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 914 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 476 గ్రామాలకు గాను 255 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. వీటి కోసం 2.50 లక్షల సర్వే రాళ్లను ప్రకాశం, అనంతపురం జిల్లాల నుంచి తెప్పించారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 438 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. ఆనాటి జగన్ ప్రభుత్వం 211 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 147 గ్రామాల్లో 1.89 లక్షల సర్వే రాళ్లను పొలాల సరిహద్దులో నాటినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మొత్తం రెండు జిల్లాల్లో కలిపి 4లక్షలకు పైగానే సర్వే రాళ్లను నాటినట్లు సర్వే, ల్యాండ్ రికార్డ్స్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూరక్ష, భూహక్కు పథకం ద్వారా చేపట్టిన పొలాల రీసర్వే కార్యక్రమంలో తమ పొలాల సర్వే సక్రమంగా జరగలేదని, మళ్లీ కొలతలు వేసి తమ భూముల విస్తీర్ణాన్ని సరిదిద్దాలని రెవెన్యూ కార్యాలయాల వద్ద జిల్లా కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో వందలాది మంది రైతులు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ఈ పొరపాట్లను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించి రైతుల నుంచి వినతి పత్రాలను తీసుకుంది. డిసెంబరు చివరికల్లా ఈ తప్పులను సరిదిద్దాలని అధికార యంత్రాంగానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ప్రధానంగా ఈ కార్యక్రమంలో ఆనాటి ప్రభుత్వం సర్వే రాళ్లను ఏర్పాటు చేయడానికి దాదాపు రూ.500 కోట్ల దాకా ఖర్చు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్కోరాయిని తయారు చేసి పొలాల్లో పాతేందుకు రూ.150 ప్రకారం 4 లక్షల సర్వే రాళ్లకు దాదాపు రూ.6 కోట్ల దాకా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. బ్రిటీష్ కాలంలో 1923లో పొలాల సర్వే జరిగిందని, అప్పటి నుంచి మళ్లీ సర్వే జరగకపోవడం వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్తూ ఆనాటి సీఎం జగనన్న భూరక్ష-భూహక్కు కార్యక్రమాన్ని 2022లో 390 జీవో ద్వారా ప్రవేశ పెట్టారు. దీని వల్ల రైతుల సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త కష్టాలు మొదలయ్యాయి. పక్క రైతులతో, బంధువులతో, స్నేహితులతో నిత్యం ఘర్షణలు మొదలయ్యాయి. ఈ గొడవలు పోలీస్ స్టేషన్ల దాకా వెళ్లాయి. రాష్ట్ర వ్యాప్తంగా భూసర్వేతో పాటు సర్వేరాళ్లు, పాసు పుస్తకాల కోసం ఆనాటి ప్రభుత్వం దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల పాసుపుస్తకాలు, 77 లక్షల సర్వే రాళ్ల తయారు చేయించింది.

మిగతా 6లో..

మద్దతు ధరకు పత్తి కొనుగోలు

- మరో రెండు పరిశ్రమల్లో సీసీఐ కొనుగోలు
- డిసెంబరు 2నుంచి నిబంధనలు సడలింపు
- సీసీఐ జనరల్ మేనేజర్ అమర్‌నాథ్ రెడ్డి



పరిశ్రమల యజమానులతో సీసీఐ జనరల్ మేనేజర్ అమర్‌నాథ్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మద్దతు ధరకే పత్తి కొనుగోలు చేస్తామని ఏపీసీసీఐ జనరల్ మేనేజర్ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మార్కెట్ యార్డు పరిధిలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి చాంబర్‌లో సీసీఐ లీజు తీసుకున్న పత్తి పరిశ్రమల యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని ఎప్పటికప్పుడు జిన్నింగ్ చేసి దూది బేళ్లుగా కట్టి నిల్వ ఉంచాలన్నారు. నిబంధనల ప్రకారం పత్తిని జిన్నింగ్ చేయాలని సూచించారు. ఇప్పటికే ఎన్‌డీబీఎల్ పరిశ్రమ, నాగేంద్ర, జిన్నింగ్ పరిశ్రమ, దారా శ్రీజిన్నింగ్ పరిశ్రమలో కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మరో రెండు జిన్నింగ్ పరిశ్రమలు జయంత్ కాటన్స్, ఐశ్వర్య జిన్నింగ్ పరిశ్రమల్లో పత్తి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 17వేల క్వింటాళ్ల పత్తి రైతుల నుంచి కనీస మద్దతు ధర రూ.7,521తో కొనుగోలు చేశామన్నారు. వారం రోజులోపు రైతు ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డిసెంబరు 2నుంచి నిబంధనలు సడలించి ప్రతి రైతు నుంచి మొత్తం పత్తిని కొనుగోలు చేస్తామన్నారు. సమావేశంలో జిన్నింగ్ పరిశ్రమ యజమానులు వెంకటరామ్ రెడ్డి, బత్తిన కుబేర్‌నాథ్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

నగర పాలక సంస్థ అధికారుల హెచ్చరిక



కర్నూలు న్యూసిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒకటో వార్డు ఖండేరి రాఘవేంద్ర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాల వెనుక భాగంలో పార్కు స్థలం ఉంది. అందులో సుమారు 40 ఏళ్లుగా 5 సెంట్ల స్థలంలో పేదలు గుడిసెలు, ఇళ్లు నిర్మించుకుని జీవనం కొనసాగిస్తున్నారు. వారంతా రోజు కూలీ పని చేసుకునే బతికేవారు. అయితే ఈ సంవత్సరం ఏప్రిల్ 13న సుమారు 100 మంది పోలీసులు, 50 మంది నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది హుటాహుటిన వచ్చి ఇళ్లను తొలగించారు. దీంతో పిల్లాపాపలు...తల్లిదండ్రులు, వస్తువులతో నడిరోడ్డున పడ్డారు. ఈ క్రమంలో బాధితులు కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకుండానే మరోసారి అక్రమంగా నిర్మాణాలు వేసుకుంటున్నారని అధికారులకు తెలిసింది. దీంతో మం గళవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వెళ్లి స్టేటస్ కో ఉందని ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదని హెచ్చరికలు జారీ చేశారు. తమకు కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చాయని, అందుకోసమే ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు స్థానికులు తెలిపారు.

స్టేటస్ కో ఉందని హెచ్చరించాం

ఖండేరిలో నగర పాలకకు సంబంధించి 5 సెంట్ల పార్కు స్థలం ఉంది. కొందరు ఇళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అది పార్కు స్థలం కావడంతో ఖాళీ చేయాలని గతంలో నోటీసులు జారీ చేశాం. అయినా వినలేదు. దీంతో ఈ సంవత్సరం ఏప్రిల్‌లో వాటిని కూల్చాం. అయినా కొందరు అక్రమంగా పార్కు స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టకూడదని మళ్లీ హెచ్చరించాం.
- ప్రదీప్‌కుమార్,
నగర పాలక సంస్థ సిటీ ప్లానర్

పోరాటాలకు సిద్ధం కావాలి

- కార్మిక, కర్షక వ్యతిరేకి బీజేపీ
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ. గఫూర్
- కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ఆందోళన

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక విధానాలకు అవలంబిస్తున్న ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ.గఫూర్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ కార్మిక, కర్షక వ్యతిరేకి అన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు ఎదు ర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప అధ్యక్షతన ఆందోళన చేపట్టారు. ముందుగా జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకురావడం దారుణమన్నారు. కేవలం పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు తీసుకువస్తుందని మండిపడ్డారు. 375 రోజులు కొనసాగిన రైతుల ఉద్యమం సందర్భంగా ప్రధాని మోదీ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమైందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతులకు నష్టదాయకమైన విధానాలను అనుసరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జే.లలితమ్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ, ఏఐకేఎస్ నాయకులు మల్లికార్జున, సుంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎంఏ. గఫూర్

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

కలెక్టర్ పి. రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా చిత్రంలో ఎస్పీ

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మాదక ద్రవ్యాల నియంత్రణ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వల్ల జరిగే నష్టాలను తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని డీఈవో, ఆర్ఐవో, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, యూనివర్సిటీ అధికారులను ఆదేశించారు. అన్ని విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, డీటీసీ శాంతకుమారి, కార్మిక శాఖ అధికారి సాంబశివరావు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, జిల్లా అటవీ శాఖ అధికారి శ్యామల పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం 2022-2023 రెండో విడత నిధులు మంజూరు చేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తాడేపల్లిలోని పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు ఈనెల 21న లేఖ రాశారు. ఈ మేరకు ఈఎన్‌సీ నుంచి రాష్ట్ర మున్సిపల్ శాఖ డైరెక్టర్ కన్నబాబుకు నివేదికలను సమర్పించారు. అయితే నగర పాలక కౌన్సిల్ తీర్మానం ఆమోదం పొందిన తరువాతనే ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.15,60,12,349 విడుదల చేయాలని కమిషనర్ లేఖలో పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, శానిటేషన్, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం నిధులను వెచ్చించనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

వైభోగంశ్రీవారి కల్యాణం



కోడుమూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరులో లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం అభిషేకం, పుష్పార్చన, ఆకుపూజ చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను కల్యాణ మండపం చేర్చారు. పురోహితుడు రవిసింహశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.

శివ..శివ..శంకర..



శ్రీశైలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని క్షేత్రానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం తెనాలి, హైదరాబాద్‌కు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణపతికీర్తన, కాలభైరవాష్టకం, శ్రీశైల శివమయం, ఓంకారనాదం, శంకరా శశిధర, శ్రీచక్రరాజ సింహాసనే తదితర శైవ గీతాలకు కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

నీటి కోసం గళమెత్తారు..!



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

- రబీలో తాగునీటి సమస్య రాకూడదు
- వాడివేడిగా ఐఏబీ సమావేశం
- సాగు, తాగునీటి కోసం ఎమ్మెల్యేల పట్టు
- ఎల్లెల్సీ, హంద్రీనీవా విస్తరణతో మరో 10 టీఎంసీలకు కార్యాచరణ
- కీలక అంశాలపై తీర్మానం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ అసెంబ్లీలో గళమెత్తిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తాగునీటి కోసం పట్టుపట్టారు. రబీలో సాగు, తాగునీటి కోసం రైతుల పక్షాన నిలిచి ముక్తకంఠంతో ఐఏబీ సమావేశంలో తమ వాణి వినిపించారు. మంగళవారం కర్నూలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రబీ సీజన్‌లో నీటి విడుదలకు సంబంధించిన ఐఏబీ సమావేశం మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో జరిగింది. రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు ప్రజల నుంచి వినిపించకూడదని, ఇప్పటి నుంచే తగిన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా వీలైనంత ఆయకట్టుకు ప్రస్తుత రబీలో హంద్రీనీవా, ఎల్లెల్సీ, కేసీ కెనాల్ నుంచి నీటిని అందించాలని పంట చివరి దశలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కీలకమైన కృష్ణా ట్రిబ్యునల్ బోర్డుతో పాటు హంద్రీనీవా నుంచి ప్రస్తుత కేటాయింపునకు అదనంగా మరో 10 టీఎంసీల నీటిని కేటాయించాలని ఇతర ముఖ్యమైన అంశాలపై ఐఏబీ సమావేశంలో సభ్యులు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు.

మిగతా 7లో..

పోస్టాఫీసుకు పోటెత్తారు..!



- రూ.1500 జమ చేస్తారంటూ వదంతులు
- ఉదయం 5 గంటలకే మహిళల క్యూ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని పోస్టాఫీసులన్నీ వేలాదిగా తరలివస్తున్న మహిళలతో కిటకిటలాడుతున్నాయి. 18 ఏళ్లు పైబడిన మహిళల వ్యక్తిగత ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 జమ చేస్తుందన్న వదంతులు రావడంతో మహిళలు పోస్టాఫీసులకు పరుగులు తీశారు. మంగళవారం నగరంలోని హెడ్ పోస్టాఫీసు వద్ద తెల్లవారుజాము నుంచి మహిళలు క్యూలో బారులుదీరారు. చలిని సైతం లెక్కచేయకుండా ఆధార్ కార్డుతో నిలబడ్డారు. దీంతో ఆయా పోస్టాఫీసులు జాతరను తలపిస్తున్నాయి. మహిళలు భారీగా తరలివస్తుండటంతో వారిని అదుపు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. వచ్చిన వారందరికీ పోస్టాఫీసులో అకౌంట్‌ను ఓపెన్ చేయిస్తున్నారు. పోస్టాఫీసు ఖాతాల్లో రూ.1500 వేస్తారని పోస్టాఫీసుకు వచ్చామని, వేయరని తెలిస్తే ఎందుకు వస్తామంటూ ఓ మహిళ తెలపడం గమనార్హం.



కళ

పౌరాణికం ఆయనకు ప్రాణం

- రాష్ట్రంలోనే 38 నంది అవార్డులు సొంతం
- నాటక రంగంలో ఆయన ప్రస్తానం అప్రతిహతం
- టీజీవీ కళాక్షేత్రం ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు
- కళకు జీవం పోస్తున్న పత్తి ఓబులయ్య



పులిస్వారీ నాటకంలోని ఒక దృశ్యం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 26:

● రాయలసీమలోని అలనాటి ఫ్యాక్షన్ పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపిస్తూ ఆయన దర్శకత్వంలో ప్రదర్శించిన 'పులిస్వారీ' నాటకం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా 150 సార్లకు ప్రదర్శితమై ప్రశంసలు అందుకుంది. అంతేకాదు, సీమ ముఠా కక్షల నిర్మూలనకు ఎంతో దోహదం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే నంది నాటక పోటీల్లో రెండు బహుమతులు కైవశం చేసుకుంది.

● దేశ తొలి స్వాతంత్ర్య సమరయోధుల్లో ఒకరైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా రూపొందించిన 'సై...సైరా నరసింహారెడ్డి' నాటకానికి ఆయన దర్శకత్వం వహించారు. ఈ నాటకం రాయలసీమలో ప్రఖ్యాతి పొందింది. విమర్శకుల చేత ప్రశంసలు అందుకుంది. వందకు పైగా ప్రదర్శనలతో గుర్తింపు సంపాదించుకున్న ఈ నాటకంలోని అనేక ఘట్టాలను నటుడు చిరంజీవి 'సైరా' పేరుతో చలన చిత్రాన్ని కూడా తీశారు.

● రాష్ట్ర నంది నాటక పోటీలు ఆరంభమైన తరుణంలో అప్పటి వరకు జిల్లాకు అందని నంది బహుమతులను ఎలాగైనా సాధించాలనే తపనతో ఆయన దర్శకత్వం వహించిన మరో పౌరాణిక పద్య నాటకం 'నర నారాయణ'. ఈ నాటకం ఐదు నందులతోపాటు, ప్రత్యేక జ్యూరీ అవార్డును సొంతం చేసుకుంది. అలా ఆయన నాటక రంగంలో మొదలెట్టిన ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. ఆ జైత్ర యాత్రలో ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారు. కందనవోలు పేరు ప్రఖ్యాతలను జాతీయ స్థాయిలో ఆయన నిలబెట్టారు. గత ఏడాది వరకు జరిగిన నంది నాటక పోటీల్లో ఆయన దర్శకత్వం వహించిన నాటకాలు 38 నంది అవార్డులతో రాష్ట్ర నాటక రంగ చరిత్రలోనే ఒక ప్రత్యేకత గుర్తింపు పొందాయి. ఆయనే కర్నూలుకు చెందిన రంగస్థల నటుడు, దర్శకుడు, రచయిత పత్తి ఓబులయ్య. వృత్తిరీత్యా సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి విశ్రాంతి తీసుకున్న ఆయన, కళామతల్లి సేవకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. కర్నూలు నాటక రంగం పేరు చెబుతూనే రాష్ట్ర స్థాయిలో గుర్తించే నాటక పురస్కారాల కృషీవలుడుగా రాణిస్తున్నారు. జిల్లా నాటక రంగానికి పత్తి ఓబులయ్య 40 ఏళ్లకు పైగా సేవలు అందిస్తున్నారు.



తానా పురస్కారం నాటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి చేతుల మీదుగా అందుకుంటున్న పత్తి ఓబులయ్య

కుటుంబం, జీవిత నేపథ్యం...

ఆనాటి ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జె.పుల్లలచెరువు గ్రామంలో 1952 జనవరి 1న వ్యవసాయ కుటుంబంలో ఓబులయ్య జన్మించారు. తిరుపతిలో విద్వాన్, ఎంఏ తెలుగు పూర్తి చేశారు. అనంతరం కర్నూలు చేరుకొని 1980 నుంచి 2005 వరకు తెలుగు అధ్యాపకునిగా పని చేశారు. 2005 నుంచి 2010 వరకు సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి అక్కడే పదవీ విరమణ చేశారు. అప్పటికే నాటక రంగంలో ప్రవేశం ఉన్న ఆయన తొలుత సాంఘిక నాటకాలపై దృష్టి పెట్టారు. అలా నాటకాలు వేస్తూనే 2002 నుంచి ఇప్పటి వరకు లలిత కళాక్షేత్రం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 1999 నుంచి 2020 వరకు జిల్లా సాంస్కృతిక మండలి సభ్యుడిగా కొనసాగారు. 2017 నుంచి 2020 వరకు టీటీడీ ధర్మప్రచార మండలి జిల్లా అధ్యక్షుడిగా ధార్మిక సేవలు అందించారు.

'పులిస్వారీ'కి శాసన సభ కమిటీ అభినందనలు

పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించిన 'పులిస్వారీ' నాటకం రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. సుమారు 150కి పైగా వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చిన ఈ నాటకం రాయలసీమ ఫ్యాక్షన్ తీరును కళ్లకు కట్టేలా చూపారు. 1998లో నాటి కలెక్టర్, ఎస్పీల ప్రోత్సాహంతో ఉమ్మడి రాష్ట్రంలో ప్రదర్శనలివ్వడంతోపాటు ఈ నాటకాన్ని నాటి శాసనసభ కమిటీ వీక్షించి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. సీమలో ముఠా కక్షలు తగ్గడానికి ఈ నాటకం ఎంతో దోహదం చేస్తున్నదని, సీమలోని ఫ్యాక్షన్ పాతుకున్న పల్లె పల్లెల్లో ప్రదర్శించాలని సిఫారసు చేసింది. ఈ నాటకం 1999 నంది నాటక పోటీల్లో రెండు నంది బహుమతులు సాధించి పత్తి ఓబులయ్యకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. అనంతరం ఆయన అనేక సాంఘిక నాటకాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించారు.

పౌరాణిక పద్య నాటకాలకు ఊపిరి...

ప్రపంచ భాషల్లో ఒక్క తెలుగు భాషకే సొంతమైన పౌరాణిక పద్య నాటకం తెర మరుగవుతున్న తరుణంలో ఆ రంగానికి ఊపిరిలూదుతున్నారు పత్తి ఓబులయ్య. మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ల సహకారంతో, టీజీవీ కళాక్షేత్రం పక్షాన ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో నిర్వహించే పరిషత్తు నాటక పోటీల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నంది నాటక పోటీల్లో మహారథి కర్ణ, బభ్రువాహన విజయం, శ్రీకృష్ణాభిమన్యు, నరనారాయణ, సై...సైరా నరసింహారెడ్డి, కర్ణార్జునీయం, ప్రమీలార్జునీయం, శ్రీకృష్ణ కమలపాలిక నాటకాలకు దర్శకత్వం వహించి ప్రదర్శించి రాష్ట్ర జాతీయ పురస్కారాలు సాధించారు.




2017లో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి నంది పురస్కారం అందుకుంటున్న పత్తి ఓబులయ్య

నాటక రంగ ఖ్యాతిని చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నాం

పౌరాణిక పద్య నాటకాలకు రాయలసీమలో పల్లెపల్లెనా ఆదరణ ఉంటుంది. అలాగే నాటక రంగానికి పుట్టినిల్లుగా కర్నూలు నిలుస్తుంది. అందుకే జిల్లా ఖ్యాతిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో చాటి చెప్పే ప్రయత్నంగా వినూత్నంగా నాటకాలను ప్రదర్శిస్తున్నాం. ప్రదర్శించిన ప్రతిచోటా పురస్కారాలు వస్తున్నాయంటే నాతోపాటు సహ నటీనటుల కృషి కూడా ఎంతో ఉంది. ఇక టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడిగాను అనేక జాతీయ నాటక పోటీల ఏర్పాటుతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కళాకారుల ప్రదర్శనలు ఇస్తున్నాం. స్థానిక కళాకారులకు కూడా ప్రోత్సాహకాలు అందిస్తున్నాం.

- పత్తి ఓబులయ్య, నాటక దర్శకుడు

అన్ని వర్గాలకు సమన్యాయం

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- ఘనంగా భారత రాజ్యాంగం దినోత్సవం
- అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ద్వారానే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి. రంజిత్ బాషా, ఎమ్మెల్సీ మధుసూదన్, పాణ్యం, ఆదోని, ఆలూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, పార్థసారధి, విరూపాక్షి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తదితరులు రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎంతో మంది మహానుభావులు దశాబ్దాల తరబడి చేసిన త్యాగాల ఫలితమే దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లభించాయని, ఆ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా అంబేడ్కర్ నేతృత్వంలో ఒక గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగం ద్వారా దేశాన్ని అన్ని విధాలా పురోగతి వైపు ఏ విధంగా తీసుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి టీజీ భరత్

ప్రతి పౌరుడు రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి : కలెక్టర్

సమాజంలో ప్రతి పౌరుడు భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలో రాజ్యాంగంలో పౌరుల మౌలిక హక్కులు, విధులు, బాధ్యతలు, స్వేచ్ఛ సమానత్వం, ఆర్థిక సామాజిక న్యాయం వంటి అంశాలను స్పష్టంగా పొందుపరిచి ఒక గ్రంథంగా మనకు అందించారని కలెక్టర్ తెలిపారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజ్యాగం పీఠికను చదివి ప్రతిజ్ఞ చేయించారు.

భక్తి భావం పెంచుకోవాలి

త్రిదండి యదుగిరి రామానుజ జీయర్ స్వామిజీ

కర్నూలు కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తిభావనలు పెంచుకోవాలని, ధార్మిక మార్గం ఒక్కటే సమాజాన్ని శాంతియుతంగా నిలుపుతుందని మైసూరులోని మేల్కొట తిరునారాయణ క్షేత్రం 41వ పీఠాధిపతి త్రిదండి యదుగిరి యతిరాజ నారాయణ రామానుజ జీయర్ స్వామిజీ భక్తులకు పిలుపునిచ్చారు. మంగళవారం నగర శివారులోని గోదా గోకులం (శ్రీగోదా రంగనాథస్వామి) క్షేత్రానికి స్వామిజీ విచ్చేశారు. ఆలయంలోని గోదాదేవి అమ్మవారికి, రంగనాథస్వామి వార్లకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. రామానుజాచార్యుల వారు హిందూ ధర్మాన్ని దేశంలో నలుదిశలా చాటి చెప్పారని అన్నారు. గోదా గోకుల క్షేత్రంలో నిత్యం ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, భక్తులను ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం సభ్యులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న రామానుజ జీయర్ స్వామిజీ

సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి సహకరించాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణకు నిరంతరం సేవలు అందిస్తూ యుద్ధ సమయంలో అమరులు అయిన, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో త్రివిధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సాయుధ దళాల పతాక స్టిక్కర్స్, కార్ ఫ్లాగ్స్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్రివిధ దళాల సేవలు కీలకమని, దేశ సేవలో వీర జవానుల సేవలు మరువలేనివన్నారు. ప్రతి ఏడాది డిసెంబరు 7న దేశవ్యాప్తంగా సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకుంటామన్నారు. సాయుధ దళాల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక నిధికి విరివిగా విరాళాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి రత్న రూత్, సూపరింటెండెంట్ మహేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.


విదేశీ కరెన్సీ నోట్లు


స్వదేశీ కరెన్సీ నోట్లు

రూ.40 లక్షల విలువైన కరెన్సీ నోట్ల ప్రదర్శన

బేతంచెర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ధరణీ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్రహాం ఆధ్వ ర్యంలో ఉపాధ్యాయ బృందం సుమారు 200 పైగా దేశ విదేశాల సుమారు రూ.40లక్షల విలువైన నోట్లు, నాణేల ప్రదర్శనను విద్యార్థులకు మంగళవారం నిర్వహించారు. ఇందులో ఆయాదేశాల్లో గతంలో, ప్రస్తుతం వాడుకలో ఉన్న నోట్లు, నాణేలను ప్రదర్శించారు. అదే విధంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించారు. ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జనార్దన్, ఉమామహేశ్వరమ్మ, చిన్నయ్య, ఉపాధ్యాయులు మురికి నీటి నుంచి స్వచ్ఛమైన నీరు తయారు చేయడం, కాలుష్య వాతావ రణం లేని పాఠశాల, ఇళ్ల నిర్మాణం మొదలైన నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శన కార్యక్రమాన్ని మండల విద్యాధికారి సోమశేఖర్ పరిశీలించి అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు

జిల్లా క్రీడాకారులు


టీజీ వెంకటేశ్‌తో ఉషూ క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రంలోని అమృతసర్‌లో ఈ నెల 29 నుంచి డిసెంబరు 4 వరకు జరిగే 22వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఉషూ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఎస్ఎండీ సాద్‌బాషా, ఎం.పవన్, ఎస్ఎండీ జాద్‌బాషాల మంగళవారం మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌ను కలిశారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని టీజీ పిలుపునిచ్చారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగన్ బొమ్మల బెడద

(5వ పేజీ తరువాయి)

సమగ్ర భూసర్వేలో భాగంగా పొలాల్లో పాతిన రాళ్లపై జగన్ బొమ్మను చెరిపేసేందుకు రూ.15 కోట్లు ఖర్చు అవుతుందని కూటమి ప్రభుత్వం అంచనా వేసింది. ఈ పనిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, డిసెంబరు నెలాఖరు నాటికి ఎక్కడా సర్వే రాళ్లపై జగన్ ఫొటో ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం ఇచ్చింది. అదే విధంగా రైతులకు అందించిన భూహక్కు పత్రాలపై కూడా జగన్ బొమ్మను తొలగించేందుకు కూడా కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. కర్నూలు జిల్లాలో 3 విడతల్లో కలిపి 86,900 భూహక్కు పత్రాలు, అదే విధంగా నంద్యాల జిల్లాలో 73,750 భూహక్కు పత్రాలు రైతులకు అందజేశారు. రైతుల పాసు పుస్తకాలపై పాలకుల బొమ్మలు ఉండడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో పాసు పుస్తకాలు ఇవ్వాలనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ మేరకు ప్రస్తుతం ఉన్న ఈ భూహక్కు పత్రాలు రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజముద్రతో రైతులకు త్వరలోనే పాసు పుస్తకాలు అందిస్తామని ప్రకటించింది.

సర్వే రాళ్లపై బొమ్మలను చెరిపేస్తున్నాం



కర్నూలు జిల్లాకు రెండున్నర లక్షల సర్వే రాళ్లను ప్రకాశం, అనంతపురం జిల్లాల నుంచి తెప్పించారు. మరో 50వేల సర్వేరాళ్లు రైతుల పొలాల్లో పాతాల్సి ఉంది. కొన్ని సర్వే రాళ్లు ఆయా గ్రామాల్లోని రైతు సలహా కేంద్రాల వద్ద ఉన్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత కూటమి ప్రభుత్వం చెప్పిన ప్రకారం సర్వే రాళ్లపై బొమ్మలను చెరిపేసే కార్యక్రమం చేపడుతున్నాం.

- మునికన్నన్, సర్వే ల్యాండ్స్ డిప్యూటీ డైరెక్టర్

నీటి కోసం గళమెత్తారు..!

- వాడీవేడిగా ఐఏబీ సమావేశం
- సాగు, తాగునీటి కోసం ఎమ్మెల్యేల పట్టు
- ఎల్లెల్సీ, హంద్రీనీవా విస్తరణతో మరో 10 టీఎంసీలకు కార్యాచరణ



కర్నూలుకు పది టీఎంసీలు కేటాయించండి

- గౌరుచరిత, ఎమ్మెల్యే

కర్నూలు జిల్లా ప్రతి ఏటా కరువు పరిస్థితులు ఎదుర్కొంటోందని, రైతులు కూలీలు, కుటుంబ పోషణ కోసం పక్క జిల్లాలు, రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారన్నారు. హంద్రీనీవా, కేసీ కెనాల్, ఎల్లెల్సీ, జిల్లా గుండా ప్రవహిస్తూనే ఉన్నా ఈ పరిస్థితి నెలకొనడం విచారకరమన్నారు. వెంటనే రెండు సీజన్లలో స్థిరీకరించిన ఆయకట్టుకు నీరందించాలని, వలసలను ఆపాలని మంత్రితో పాటు కలెక్టర్‌కు ఎమ్మెల్యే గౌరు చరిత విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా హంద్రీనీవా కాలువ వెడల్పుతోపాటు లైనింగ్, తదితర వాటికి ప్రభుత్వం నిధులు కేటాయించినందున 40టీఎంసీల నుంచి మరో 20 టీఎంసీల నీరు అదనంగా పెరిగే అవకాశం ఉందని ఈ మొత్తంలో 10 టీఎంసీల నీటిని కర్నూలు జిల్లాకు కేటాయించాలని తీర్మానం చేయాలని గౌరు చరిత పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటి సమస్య ఇకపై ఉండరాదని, ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డును కర్నూలులో ఏర్పాటు చేస్తానే రాయలసీమకు న్యాయం జరుగుతుందని గౌరు చరితమ్మ స్పష్టం చేశారు.

(5వ పేజీ తరువాయి)

ఐఏబీ సమావేశంలో మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు బాగా పడ్డాయని, అందువల్ల ఎక్కడా తాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉండకూడదన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి సమస్యను అత్యధిక ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నీటి సప్లయ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, సీపీడబ్ల్యూఎస్ పథకం కింద ఫిల్టర్ బెడ్స్, ఓ అండ్‌ఎం విభాగంలో సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అధికారులను మంత్రి ప్రశ్నించారు. కొన్ని చోట్ల ఫిల్టర్ బెడ్స్‌తో పాటు ఓఅండ్‌ఎం సమస్యలు గుర్తించామని, ఈ అంశంపై నిధుల మంజూరు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపినట్లు అధికారులు తెలిపారు. ఆ ప్రతిపాదనల వివరాలు తనకు అందించాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి చోరీ కేసులపై సమావేశంలో చర్చించారు. రూ.2.6 కోట్ల విలువ చేసే ఆయిల్‌తో పాటు కాపర్ చోరీ జరిగిందని, మోటార్లు రన్నింగ్ కండీషన్‌లో తీసుకువచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ బాల చంద్రారెడ్డి తెలిపారు.

ప్రతి గ్రామాన్నీ సందర్శించండి : కలెక్టర్



జిల్లాలో ప్రతి గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్యను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని డీపీవోతో పాటు జడ్పీసీఈవోను ఆదేశించారు. సబ్ కలెక్టర్, ఆర్డీవోలు కూడా ఈ అంశంపై ఎప్పటికప్పుడు ఆయా విభాగాల అధికారులతో సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి పథకాలకు సంబంధించి చిన్న చిన్న సమస్యలు ఉంటే వెంటనే జడ్పీ మండల నిధుల నుంచి మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్ద సమస్యలు ఉంటే తక్షణమే నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్ఎస్ ట్యాంకులు, చెరువులు వెంటనే హంద్రీనీవాతోపాటు ఎల్లెల్సీ, కేసీ కెనాల్ నుంచి నింపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించడంలో బాధ్యతలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీ అధికారులకు స్పష్టం చేశారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో 68 చెరువులను హంద్రీనీవా కాలువ నీటితో మార్చిలోపు నింపాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆర్థిక సంఘం నిధులు తాగునీటికే...

ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ రాబోయే వేసవిలో ఆదోని పట్టణానికి తాగునీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే అధికారులు కార్యచరణతో పనులు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదలయ్యాయని, ఆ నిధులను తాగునీటి సమస్యలు తీర్చేందుకు మాత్రమే వినియోగించుకోవాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఖరీఫ్‌లో 20వేల ఎకరాలకు నీటిని విడుదల చేశామని, రబీలో 3,600 ఎకరాలకు ఎల్లెల్సీ ఆయకట్టుకు నీరు అందించేందుకు ప్రతిపాదించడం జరిగిందని ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్ మంత్రికి తెలిపారు. ఆలూరు ఎమ్మెల్యే వీరుపాక్షి మాట్లాడుతూ ఎల్లెల్సీ కాలువ నుంచి ఏప్రిల్ 15వ వరకు పంటలకు నీరు అందించాలని దేవనకొండ మండలంలో చెరువులకు మరమ్మతులు చేయించాలని, ఆలూరు చెరువును ఎస్ఎస్ ట్యాంకుగా మార్చాలని, గంజేహల్లి, బాపురం, చింతకుంట చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదన్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జలవనరుల శాఖ ఎస్‌ఈ బాల చంద్రారెడ్డి, హంద్రీనీవా ప్రాజెక్టు ఎస్‌ఈ రామగోపాల్, కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్, ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్, ఆర్డీఎస్ ఈఈ బాస్కర్ రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, డీఈ రామకృష్ణతో పాటు ఆర్డీవోలు ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యేలు పార్థసారధి, విరూపాక్షి

ఐఏబీ సమావేశంలో కీలక తీర్మానాలు:

- కేసీ కెనాల్ కింద ప్రస్తుతం ఎక్కువ ఆయకట్టు నంద్యాల జిల్లాలో ఉన్నందున అక్కడ నిర్వహించే ఐఏబీ సమావేశంలో ఎంత ఆయకట్టుకు నీరందించవచ్చునో నిర్ణయం తీసుకోవాలి.
- ఎల్లెల్సీ కింద ఆయకట్టుకు డిసెంబరు 10 నుంచి మార్చి ఆఖరి వరకు నీటిని అందించాలి.
- హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా ప్రతిపాదిక విస్తరణ పనులు జరిగే అవకాశం ఉన్నందున అదనంగా లభించే నీటిలో కర్నూలు జిల్లాకు 10 టీఎంసీలు ప్రభుత్వం కేటాయించాలి.
- గాజులదిన్నె ప్రాజెక్టు కింద నవంబరు 30 నుంచి 15వేల ఎకరాలకు సాగునీటిని అందించాలి.
- వచ్చే మార్చి ఆఖరు నాటికి 68 చెరువులకు నీటిని నింపే కార్యక్రమం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి.
- కృష్ణ, తుంగభద్ర తదితర ఉప నదులు కర్నూలు మీదుగానే ప్రవహిస్తున్నాయి. అందుకోసం కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు అణువుగా కర్నూలు కేంద్రంగా కృష్ణా మేనేజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- భార్యపైనే అనుమానం

కొలిమిగుండ్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పేట్నికోట గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గొల్ల పామిడి రమేష్(40) అనే వ్యక్తి ఇంట్లో మద్యం మత్తులో మృతి చెందినట్లు అతడి భార్య మంగళవారం బంధువులకు, గ్రామస్థులకు తెలిపింది. అయితే, ఈ ఘటన అనుమానాస్పదంగా ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రమేష్‌బాబు చేరుకొని విచారణ చేపట్టగా భార్య పొంతనలేని సమాధానం చెప్పడంతో, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, మృతుడి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె కాల్ డేటా ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సోదరి గూటం రమాదేవి ఫిర్యాదు మేరకు మృతుడి భార్యతో పాటు, గోపాల్ అనే వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చాగలమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. మంగళవారం ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 12న చిన్నవంగలి గ్రామానికి చెందిన నారాయణమ్మ (61) గీజర్ ఆన్ చేయగా ప్రమాదవశాత్తు పేలింది. దాంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబీకులు కడప జిల్లా ప్రొద్దుటూరు వైద్యశాలకు, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ నారాయణమ్మ మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

కౌతాళం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంబళనూరు గ్రామానికి చెందిన ఎనిమిది మందిపై సోమవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయింది. మంగళవారం ఎమ్మిగనూరు డీస్పీ ఉపేంద్ర బాబు, కౌతాళం సీఐ అశోక్ బాబుతో కలిసి గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో ఈరన్నను కులం పేరుతో అదే గ్రామానికి చెందిన ఎనిమిదిమంది బీసీ కులస్తులు దూషించినట్లు ఈరన్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కౌతాళం సీఐ అశోక్‌బాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం సాయంత్రం కుంబళనూరు గ్రామానికి వచ్చి దూషించినట్లు తెలిపిన ప్రదేశంలో ఫిర్యాదుదారునిని విచారించి దర్యాప్తు చేపట్టారు. కేసును విచారించి ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాలను సేకరించి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. వీరి వెంట కౌతాళం సీఐ అశోక్ కుమార్ పోలీసులు ఉన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం, వ్యక్తి అరెస్టు

మంత్రాలయం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఈడిగ జయరాముడును అరెస్టు చేసినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. మంగళవారం రాఘవేంద్రపురంలో రహస్యంగా వచ్చిన సమాచారం మేరకు ఈడిగ రాముడుని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 19 రాయల్ స్టాగ్ క్వాటర్ బాటిళ్ల మందును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్ కు తరలించినట్లు తె లిపారు. మంత్రాలయంలో కర్ణాటక మద్యం అమ్మినా.. బెల్టు షాపులు నిర్వహించిన ఉపేక్షించేది లేదని, కేసులు నమెదు చేసి కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వెలుగోడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలివీ.. వేల్పనూరుకు చెందిన వెంకటేశ్వర్లు(58), శ్రీనివాసులు గ్రామం నుంచి నుంచి ద్విచక్ర వాహనంపై వెలుగోడుకు బయలు దేరారు. వెలుగోడు నుంచి సరుకుల లోడ్‌తో ఓ వాహనం బయలుదేరింది. అయితే అబ్దుల్లాపురం, వేల్పనూరు గ్రామాల రహదారిలో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. వెంకటేశ్వర్లుకు అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీనివాసులుకు కుడి కాలు విరగడంతో నంద్యాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఆదోని, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణం కార్వాన్ పేట వీధికి చెందిన షేక్ షబ్బీర్ (30) అనే యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే జీఆర్‌పీఎఫ్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు. కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ షబ్బీర్ (ఫైల్)

ఆరబెట్టిన మిరప పంటకు నిప్పు

- రూ. 3 లక్షల ఆస్తినష్టం
- గుర్తు తెలియని వ్యక్తుల పనే..



కాలిపోతున్న మిరప దిగుబడి, ఇన్‌సెట్‌లో బాధిత రైతు శ్రీనివాసులు

ఎమ్మిగనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆరబెట్టిన మిరప పంటను గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఈ ఘటన ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఎర్రకోట గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. దీంతో మిరప పంట కాలిబూడిదై రూ.మూడు లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత రైతు శ్రీనివాసులు వాపోయాడు. వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు తనకున్న మూడు ఎకరాలలో మిరప సాగుచేశాడు. దాదాపు రూ. మూడు లక్షలు ఖర్చు చేశాడు. 20రోజుల క్రితం పంట చేతికి రావటంతో 12క్వింటాళ్ల మిరపను తెంచి కర్నూలు రహదారి సమీపంలో ఓ పొలంలో ఆరబెట్టాడు. ఒకటి రెండు రోజుల్లో మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మిరప పంటపై పెట్రోల్ చల్లి నిప్పుపెట్టి పరారయ్యారు. మంటలు చూసిన ఎదురుగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాల దగ్గర ఉన్న వ్యక్తులు చూసి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు, రైతు శ్రీనివాసులు కల్లం దగ్గరకు చేరుకొని చూసే సరికి పంట కాస్త కాలిబూడిదయ్యింది. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైతు మాట్లాడుతూ రూ.లక్షలు ఖర్చుచేసి సాగుచేసిన పంట చేతికొచ్చిందనుకున్న సమయంలో దుండగులు నిప్పు పెట్టడంతో కాలిబూడిదయ్యిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

నిధులు దుర్వినియోగం చేశాడని ఫిర్యాదు

శిరివెళ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాక అధ్యక్షుడు సతీష్ కుమార్, ఎంఈవో డీటీ శంకర్ ప్రసాద్‌కు మంగళవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. 2018 నుంచి 2023 వరకు పాఠశాలకు మంజూరైన పలు రకాల నిధులను అప్పటి హెచ్‌ఎం బోగస్ బిల్లులు సమర్పించ డంతో పాటు బిల్స్ టాంపరింగ్ చేసి రూ.34,590 దుర్వినియోగం చేసినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి తెచ్చామన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలతో ఎంఈవోకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాల నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సదరు హెచ్‌ఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నిధులను రికవరీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు బీటీఎఫ్ సతీష్ కుమార్ వెల్లడించారు.



శిరివెళ్ల ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న సతీష్ కుమార్

ప్రజాస్వామ్య రక్షణలో రాజ్యాంగం పాత్ర కీలకం

- నంద్యాల జేసీ విష్ణుచరణ్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జేసీ, తదితరులు

నంద్యాల కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణలో రాజ్యాంగం కీలక పాత్ర వహిస్తోందని నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జేసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం 1949 నవంబరు 26 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. రాజ్యాంగంలోని మార్గదర్శకాల మేరకే ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. రాజ్యాంగ బద్దంగానే అసెంబ్లీ, పార్లమెంట్‌లో నూతన విధానాలను ప్రవేశపెట్టి ఆ మేరకే అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలుపరిచే విధానాలు, కోర్టు ఉత్తర్వులు కూడా రాజ్యాంగాన్ని అనుసరించే ఉంటాయన్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ.1.28 లక్షల నగదు, ఐదు బైకులు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం

మంత్రాలయం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు సీఐ రామాంజులు తెలిపారు. మంగళవారం రాత్రి ఎస్ఐ పరమేశ్ నాయక్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రహస్య సమాచారం మేరకు తుంగభద్ర నది బూదూరు పంప్‌హౌస్ వద్ద ఆదోని, ఎమ్మిగనూరుకు చెందిన పదిమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అరెస్టుచేసి రూ.1.28 లక్షలు, ఐదు బైకులు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరుస్తా మని తెలిపారు. సిబ్బంది రామకృష్ణ, లక్ష్మణగౌడు, నాగేశ్వరరెడ్డి, సోమ్లా నాయక్ ఉన్నారు.

సారా స్థావరాలపై దాడులు

కర్నూలు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగారుపేటలో సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం 2,700 బెల్లం ఊట, 85 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకు న్నామని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. ఎం.కన్య, బోయ మద్దమ్మ, బోయసుధాకర్‌లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. సీఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్‌గా పి. వెంకటన్న

కర్నూలు హాస్పిటల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య జోన్-4 పరిధిలోని 11 మంది హెల్త్ అసిస్టెంట్లకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. హుశేనాపురం పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పి.వెంకట న్నకు హెల్త్ సూపర్‌వైజర్‌గా పదోన్నతి కల్పించి నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టుకు పోస్టింగ్ వేశారు. జోన్-4 పరిధిలో హెల్త్ సూపర్‌వైజర్ల పదోన్నతుల్లో ఉమ్మడి జిల్లా నుంచి పి.వెంకటన్న ఒక్కరికే పదోన్నతి లభించడం విశేషం.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సిబ్బందిని అభినందిస్తున్న సూపరింటెండెంట్

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు
- ఢిల్లీలో శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి అభినందనలు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాలిన రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. జీజీహెచ్‌కు చెందిన ఎంఎన్‌వో రాజశేఖర్, ఎఫ్ఎన్‌వో జయమ్మ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జరీ, రీకన్‌స్ట్రక్టివ్ అండ్ బర్న్స్ సర్జరీపై ఐదు రోజుల శిక్షణ పొందారు. శిక్షణను పూర్తి చేస్తున్న ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు మంగళవారం సూపరింటెండెంట్ చాంబరులో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ డా.మంజుల బాయిని అభినందించారు. శిక్షణలో నేర్చుకున్న మెలకువల వల్ల రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. శిక్షణల వల్ల సిబ్బందిలో నైపుణ్యం పెరుగు తుందన్నారు.

కుల, మతాలకు అతీతంగా సేవ: టీజీ భరత్



ఫ్రీజర్ బాక్స్‌లను అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తున్నానని మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని మహ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ టేకర్ కమిటీ ఆధ్వర్యంలో రెండు బాడీ ఫ్రీజర్ బాక్స్‌లను మసీదులకు అందజేశారు. నగరం లోని న్యూసిటీ, ఓల్డ్ సిటీలోని రెండు మసీదులకు ఫ్రీజర్ బాక్స్‌లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ కమిటీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కాంప్లెక్స్ నాలుగున్నర సెంట్లు స్థలం ఖాళీగా ఉందని, అందులో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు తన దృష్టికి తీసుకువచ్చారని, ఇందుకు తాను సమ్మతించానని వెల్లడించారు. 8 మంది పేద ముస్లిం యువతుల వివాహాలకు ఒక్కొక్కరికి రూ.3వేలు కమిటీ తరపున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమాధికారి సబీనా పర్వీన్, కమిటీ సభ్యులు మహమ్మద్ ఇబ్రహీం, గౌస్ రబ్బాని, టీడీపీ నాయకులు జహంగీర్, అబ్బాస్, హమీద్, రమీజ్ బాషా, షేక్ మహబూబ్, షేక్ అబ్దుల్ మునాఫ్ పాల్గొన్నారు.

కుడా చైర్మన్‌కు సన్మానం



సోమిశెట్టిని సన్మానిస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లును టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సన్మానించారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా రెండో సారి చైర్మన్‌గా నియామం కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సభ్యులు సోమశేఖర గౌడ్, జీసీ రాముడు, కేజీఎస్ రావు, శ్రీనివాసులు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, కే నాగరాజు, ఎం దేవరాజ్, ఉమ్మర్ బాషా, డీఆర్ బాబు పాల్గొన్నారు.

● **సోమిశెట్టికి ఆర్యవైశ్యుల సన్మానం..** సోమిశెట్టి వెంకటేశ్వర్లును ఆర్యవైశ్యులు జయంతి విష్ణుతేజ, కే నాగతేజ, శిరిగుప్ప వెంకటేశ్వర్లు, చిన్న, సాయికుమార్, వెంకటేశ్వర్లు, సుధాకర్ గుప్తాలు శాలువతో సత్కరించారు.

అత్యవసర కేసులను త్వరగా షిఫ్టు చేయండి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్యాజువాల్టీ విభాగం నుంచి వచ్చే అత్యవసర కేసులను సంబంధిత విభాగాలకు షిఫ్టు అయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత డీఏపీ (డ్యూటీ అసిస్టెంట్ ఫిజీషియన్) క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్లదేనని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన జనరల్ మెడిసిన్ సూపర్ స్పెషాలిటీ, క్యాజువాల్టీ, ఏఎంసీ రెఫరల్ అయ్యే కేసులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ-హాస్పిటల్, ఓపీ, ఐపీ, డిశ్చార్జ్, క్లినికల్, మాడ్యుల్ కేసుల్లో పురోగతిని పెంచి అన్ని కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీరాములు, సీతారామయ్య, న్యూరాలజీ హెచ్‌వోడీ సి.శ్రీనివాసులు, మెడిసిన్ ప్రొఫెసర్లు ఇక్బాల్ హుశేన్, లక్ష్మీబాయి, రాజశేఖర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని అన్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు నాగరాజు, సి.మురళీమోహన్‌రెడ్డి సరస్వతమ్మ, జితేంద్ర, పుల్లయ్య, రాంగోపాల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్రపటానికి కమిషనర్ రవీంద్రబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిషనల్ కమిషనర్ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, ఎమ్మెల్సీ మధుసూదన్, నగర మేయర్ బీవై.రామయ్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం కార్యాలయంలో ఎస్ఈ రామచంద్రారెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఈ మద్దన్న, డీఈలు రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, ఏఈలు ముక్తార్‌బాషా, సతీష్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్‌సీపీయూఎల్ యూనిట్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్ర మంలో ఉపకులపతి పీఎస్ షావలీఖాన్ విద్యార్థులతో రాజ్యాంగ ప్రవే శికపై ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా, ఎన్‌సీపీయూఎల్ యూనిట్ కోఆర్డినేటర్ జెఎండీ షఫీ, కృపాకర్ పాల్గొన్నారు.

● ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శులు శేషాద్రి, ఎల్ సుజాత హాజరయ్యారు. అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైఎస్ ప్రిన్సిపాల్ జే.హేమంత్, ఆర్. రోషన్న పాల్గొన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీలో అంబేడ్కర్ విగ్రహానికి ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, డీన్ సుందరానంద పుచ్చా. పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా టీడీపీ ఎస్సీసెల్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళి అర్పించారు. నాయకులు పోతురాజు శివ, బసవరాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: అంబేడ్కర్ రచించిన భారతరాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తన నివాసంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. టీడీపీ నాయకులు బొగ్గుల శంకరయ్య పాల్గొన్నారు.

● కర్నూలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. వైస్ ఎంపీపీ ఎం.నెహెమియా, ఎంపీడీవో రఘునాథ్, ఈవోఆర్డీ అనురాధమ్మ, పంచాయతీరాజ్ శాఖ ఏఈ ముక్తార్‌బాషా, ఎంజీఎన్ఆర్ఈజీసీ ఏపీవో మధుబాబు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు లీగల్: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటూ రాజ్యాంగ నిర్మాతల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి బి.లీలా వెంకట శేషాద్రి కోరారు. స్థానిక ప్రసూన న్యాయ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాధితులకు ఉచిత న్యాయ సాయాన్ని అందించడంలో న్యాయ కళాశాల విద్యార్థులు భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం లా విద్యార్థులతో భారత రాజ్యాంగ పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, ప్రసూన న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివాజీరావు మాట్లాడారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, కళాశాల డీన్ శివకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ హేమలత పాల్గొన్నారు.

● ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషియల్ జస్టిస్ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది వై.జయ రాజు కోరారు. మంగళవారం పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు చిన్నయ్య, పాపారావు, మాదన్న, ఎం.సుబ్బయ్య, బి.చం ద్రుడు పాల్గొన్నారు.

● స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి న్యాయవాదులచే ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ న్యాయవాదులు వై.జయరాజు, జి.నాగశేషయ్య, నాగేంద్రనాథ్ యాదవ్, నాగముని, పి.సువర్ణరెడ్డి, రాజేష్, డేవిడ్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ అధ్యక్షతన 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, గిరిజారాణి, ఉల్లోజిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాశ్ హాజరై ఉద్యోగులు, గ్రంథాలయ పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉప గ్రంథాలయ అధికారి వి.పెద్దక్క, లైబ్రేరియన్ ఎస్ బాషా పాల్గొన్నా రు.

● నగరంలోని ఎస్టీబీసీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్యామ్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వేదిక జిల్లా కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గద్వాల ఈరన్న, నగర అధ్యక్షుడు షెహజాద్, నగర కోశాధికారి కేసీ రాముడు, నైస్ కంప్యూటర్స్ శిక్షణ కేంద్రం అధినేత రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూలెక్చర్ గ్యాలరీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజ్యాంగ పీఠికను పఠనం చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయానందబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.అరుణ, ఏపీజీడీఏ కేఎంసీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరు: మండలంలోని ఉలిందకొండ గ్రామంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీడీపీ నాయకుడు ఈవీ రమణ, రంగ స్వామి రెడ్డి ఆధ్వర్యంలో ఉలిందకొండ చెరువు వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కల్లూరు ఏపీఓ మద్దీశ్వరమ్మ, సెక్రటరీ నాగేశ్వరరావు, ఈవీ.శ్రీకాంత్ పాల్గొన్నారు.

● కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపిడీఓ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కర్నూలు స్పోర్ట్స్: ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని గౌరవించాలని సెట్కూరు సీఈవో దీప్తి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని యువజన సర్వీసుల శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో కల్లూరు జడ్పీహెచ్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం వ్యాసరచన వక్తృత్వ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు జ్ఞాపికలను అందజేశారు. హెచ్ఎం హుశేన్, డీఎస్‌డీవో భూపతిరావు, కురువ నాగరాజు పాల్గొన్నారు.

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, ఇతర జిల్లా అధికారులు పాతబస్టాండులో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రామలక్ష్మమ్మ, గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజశేఖర్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సాబీహా పర్వీన్, డీఎస్‌డీవో భూపతిరావు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తిలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కోడుమూరు రహదారిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మధు, ఈశ్వరప్ప మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి క్రిష్ణయ్య, సర్పంచ్ సువర్ణ, శంకర్, గోకారి పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ ప్రసన్న రాజ్యాంగ దినోత్సవం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరి, చంద్రశేఖర్, జైశ్రీ, అరుణ కుమారి, శైలజ, సాంబశివా రెడ్డి పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని కొత్తకోట సచివాలయం, పోలకల్లు, కొండాపురం, సిబెళగల్, బురాన్‌దొడ్డి ప్రభుత్వ కార్యాలయాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్, డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో రాణెమ్మ, సర్పంచులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న సీఈవో, అధికారులు, ఉద్యోగులు



ప్రసంగిస్తున్న న్యాయాధికారి బి. లీలా వెంకట శేషాద్రి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



మెడికల్ కాలేజీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యవిద్యార్థులు





ఆర్‌యూలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వీసీ, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

సర్వేను వేగవంతం చేయాలి: డీఎల్‌పీవో



స్వర్ణ పంచాయతీ పోర్టల్ నమోదును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఓర్వకల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న జియో ట్యాగింగ్ సర్వేను వేగవంతం చేయాలని డీఎల్‌పీవో లక్ష్మీ సూచించారు. మంగళవారం మండలంలోని ఓర్వకల్లు, హుస్సేనాపురం, కాల్వ గ్రామాల సచివాలయాలను ఈవోఆర్డీ సుబ్బరాయుడితో కలిసి ఆమె సందర్శించారు. ఆయా గ్రామాల్లో గృహాలకు జియో ట్యాగింగ్‌తోపాటు బ్యాంకు ఖాతాలకు ఎన్‌సీపీఐ అనుసంధానంపై ఆరా తీశారు. సచివాలయాల సిబ్బంది ఆదాయ వ్యయాలు, ఇంటి పన్ను వసూళ్లకు సంబంధించిన అన్ని వివరాలను స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో పొందుపరచాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో గోకులం షెడ్లు, పారిశుధ్య పనులను పరిశీలించారు. సర్పంచులు చంద్ర గోవర్ధనమ్మ, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, మురళి, సురేష్, నాయకులు చంద్ర పెద్దస్వామి, ఖాదర్‌బాషా, గోవిందరెడ్డి, లక్ష్మీ కాంతా రెడ్డి పాల్గొన్నారు.

'అనుమతిలేని ల్యాబ్‌లను సీజ్ చేయాలి '

కర్నూలు హాస్పిటల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేటు డయోగ్నస్టిక్ సెంటర్లను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌వో ఎల్. భాస్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారపేటలో ఉన్న కొన్ని ప్రైవేటు ల్యాబ్‌లు రిజిస్ట్రేషన్ లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. నాయకులు బాబయ్య, బీసన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులను ఉపయోగించుకోండి

సి.బెళగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను ఉపయోగించుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఆమె మాట్లాడారు.

కంబంధహాల్‌లో 'పొలం పిలుస్తోంది': మండలంలోని కంబంధహాల్ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మల్లేష్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎస్. రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం ట్రాఫిక్ పోలీసులు, నగర పాలక అధికారులతో కలిసి కమిషనర్ పాతబస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాతబస్తీలో ఇరుకైన రహదారులు, అధిక జనసంచారం, రహదారులపై వాహనాల పార్కింగ్ వంటి సమస్యల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగిస్తామన్నారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పెద్ద మార్కెట్ వద్ద డివైడర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెల్లడిం చారు. అనంతరం కొండారెడ్డి బురుజు వెనుక భాగంలో ఉన్న పార్కును ఆయన పరిశీలించారు. ఆయన వెంట ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, ఆరోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, ఎంఈలు సత్యనారా యణ, శేష సాయి, డీఈఈ గంగాధర్ ఉన్నారు.

కర్నూలు డీఎల్‌డీవోగా జీవీ రమణారెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారిగా జీవీ రమణారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జడ్పీ డిప్యూటీ సీఈవోగా పని చేస్తున్న రమణారెడ్డిని కర్నూలు డీఎల్‌డీవోగా నియమించారు. అయితే ఇక్కడ పని చేస్తున్న డీఎల్‌డీవో బాలక్రిష్ణారెడ్డి ఇరవై రోజుల క్రితం అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారిగా బదిలీపై వెళ్లారు. ఈ మేరకు రమణారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పరిపాలన అధికారి పార్థసారథి, జూనియర్ అసిస్టెంట్ రాంసింగ్ నాయక్‌లు ఆయనకు అభినందనలు తెలిపారు.

అధ్యాపకురాలికి అభినందనలు

కర్నూలు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన ప్రపంచ సాహిత్య సదస్సుకు అధ్యాపకురాలు ఫమీద బేగంకు పత్ర సమర్పణకు అవకాశం రావడం అభినందనీయమని ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. మంగళవారం క్లస్టర్ యూని వర్సిటీలో ఉపకులపతి, రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లును ఫమీద బేగం కలిశారు. ఈ సందర్భంగా సిల్వర్ జూబ్లీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఫమీద బేగం పత్ర సమర్పణ చేసిన వివరాలను అందజేశారు. ఈసందర్భంగా ఫమీద బేగంను ఉపకులపతి అభినందిం చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీఎస్‌కుమార్, వైఎస్ ప్రిన్సిపాల్ బీఆర్ ప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ఓర్వకల్లు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీక బహుళ ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని కాల్వబుగ్గ క్షేత్రంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. దత్తసాయి సేవా సమితి తరపున దాతలు ఓర్వకల్లు లక్ష్మీకాంతారెడ్డి, విశ్రాంత ఆర్టీఓ చంద్రబాబు నాయుడు, భవాని నరేష్‌ల ఆధ్వర్యంలో వ్రతాలు నిర్వహించారు. 25 జంటలు వ్రతాలు ఆచరించాయి. అర్చకులు కళ్లే లక్ష్మీ నారాయణశర్మ, కళ్లే నరసింహాశర్మల నేతృత్వంలో వ్రత పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి'

కర్నూలు కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత భావాన్ని అలవర్చుకోవాలని ధార్మిక బోధకులు విశ్వనాథం గురూజీ అన్నారు. మంగళవారం ఏకాదశి పర్వదిన సందర్భంగా నగరంలోని సంకల్‌బాగ్‌లోగల గీతా ప్రచార ధామం సమావేశ హాలులో గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ అధ్యక్షతన సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. వక్తగా విశ్వనాథం గురూజీ మాట్లాడుతూ గీతా సారాంశాన్ని అవగాహన చేసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. డీవీ రమణ మాట్లాడుతూ ధార్మిక చింతనకు ఎంతో కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం సభ్యులు ఇల్లూరు రమణ, సింహాద్రి రమేష్, మహాబలేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.


సేవ చేయడం నా అదృష్టం: మంత్రి



అయ్యప్ప స్వాములకు భిక్ష వడ్డిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాములకు సేవ చేయడం నా అదృష్టంగా భావిస్తానని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని పాత అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు, భక్తులకు మంత్రి భిక్షను ఏర్పాటు చేశారు. ముందుగా స్వాములతో కలసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప స్వాములకు ఆయన భిక్ష వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అయ్యప్ప మాల ధారణ దీక్ష ఎంతో గొప్పదన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా టీజీవీ సంస్థల తరపున అయ్యప్ప స్వాములు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశామన్నారు. తనకు నిద్రపట్టని పరిస్థితుల్లో అయ్యప్ప స్వామి మంత్రం చదివితే ప్రశాంతంగా నిద్ర పడు తుందని అన్నారు.

ఘనంగా నాయీబ్రాహ్మణుల వనభోజనం



వనభోజనంలో పాల్గొన్న నాయీబ్రాహ్మణులు

కర్నూలు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం ఘనంగా జరిగింది. మంగళవారం వెంగన్న బావి ప్రాంగణంలో కార్తీక వనభోజనానికి విశ్రాంత లెక్చరర్ వెంకటేశ్వర్లు, ఎల్ఐసీ ఎస్పీ మద్దయ్య ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. సంఘ పెద్దలు మునిస్వామి, మంగయ్య, కింగ్స్ ప్రసాద్, కుమార్ బిట్టు, సురేష్, సిమ్లా వెంకటేశ్వర్లు, మధు కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

కర్నూలు రూరల్ నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డివిజనల్ ఇంజనీర్ రవీంద్రరెడ్డి అధికారులను ఆదేశించారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలోని చైతన్య స్కూల్ నుంచి ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ స్కూల్ వరకు రూ.10 లక్షలతో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు మంగళ వారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో సిమెంట్, కంకర, ఇసుక ఏవిధంగా వినియోగిస్తున్నారని కాంట్రాక్టర్ బాషా ఖాన్‌ను అడిగి తెలుసుకున్నారు.



సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

మీడియా ప్రతినిధులపై కేసులు తగవు


మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

ఆదోని టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మీడియా ప్రతినిధులపై కేసులు బనాయించడం తగదని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు రాజకీయ నాయకులు, ప్రజలకు మధ్య అనుసంధానకర్తలుగా పని చేస్తారని తెలిపారు. పత్రికలలో వార్తలు వస్తే మీడియాకు వివరణ ఇవ్వాలే గాని పోలీసు కేసు వరకు లాగడం సమంజసం కాదన్నారు. 'ఆంధ్రజ్యోతి' పత్రికలో గరుసు దొంగలు పేరుతో వచ్చిన వార్త రాసిన విలేకరి రవిపై పోలీసు కేసును బనాయించడాన్ని ఆయన ఖండించారు.

మీడియాపై కేసులు మంచిది కాదు

పార్టీలు, నాయకుల అభివృద్ధికి సహకరించే విలేకరులపై పోలీసు కేసులను పెట్టడం మంచిది కాదని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ కో ఆర్డినేటర్ దేవిశెట్టి ప్రకాష్ హితవు పలికారు. మంగళవారం మాట్లాడుతూ, పత్రికలలో కథనాలు సాధారణమని పోలీసులకు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. గురుసు రవాణాపై వార్త రాసిన 'ఆంధ్రజ్యోతి' విలేకరి రవిపై పోలీసు కేసు సమంజసం కాదన్నారు.

పిల్లల ఆరోగ్యమే మహా భాగ్యం


విద్యార్థినికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రాగిణి

మద్దికెర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యమే మహాభాగ్యమని వైద్యాధికారి రాగిణి అన్నారు. మంగళవారం జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, రోజూ చేతులు కడుగుకొని భోజనం చేయాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, హెచ్ఎం అంజనేయబాబు, దేవేంద్రప్ప, ఉన్నారు.

చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి

దేవనకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అస్వస్థతకు గురైన ఉపాధి కూలీ కె.నారాయణ(59) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల మేరకు.. గత శుక్రవారం ఉపాధి పని చేస్తూ అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారూమున కర్నూలులో మృతి చెందినట్లు భార్య సంజమ్మ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు కాగా, ఒకరు ఇప్పటికే మృతిచెందారు.

ప్రజల కష్టాలను నివేదించా: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే పార్థసారథికి స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

ఆదోని టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల కష్టాలను అసెంబ్లీలో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెలే పార్థసారథి అన్నారు. మంగళవారం పట్టణానికి తిరిగి వచ్చిన ఎమ్మెల్యేకు బసవేశ్వర సర్కిల్‌లో బీజేపీ కార్యకర్తలు స్వాగతం పలికారు. బీజేపీ ప్రత్యేక ఆహ్వానితుడు విట్టా రమేష్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, ఆదోని అసెంబ్లీ కన్వీనర్ నాగరాజ్ గౌడ్, ఉపేంద్ర, దేశాయ్ చంద్రన్న, న్యాయవాది లోకేష్, చెన్న బసప్ప పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు


రహదారి కిందభాగంలో కొట్టుకుపోయిన మట్టి

కరివేముల గ్రామం వద్ద కర్నూలు-బళ్లారి రహదారిలో హంద్రీకాలువ పైపు లైన్ పక్కన మట్టి కోసుకుపోయింది. ఈ రహదారిలో నిత్యం భారీ వాహనాలు వెళుతుంటాయి. చోదకులు ఏమాత్రం ఆదమరిచినా వాహనాలు బోల్తాపడే ప్రమాదం ఉంది. గతంలో రైతులు రోడ్డుని తవ్వి పైపులైన్ ఏర్పాటు చేసుకున్నారు. దానిపైనే అధికారులు రోడ్డు వేశారు. మట్టి కొట్టుకుపోతుండటంతో ప్రమాదంగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. **- దేవనకొండ.**

30న పింఛన్ల పంపిణీ

ఆదోని టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నవంబరు 30వ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ మంగళవారం తెలిపారు. పింఛన్‌దారులు ఆ రోజు అందుబాటులో ఉండాలని ఆమె కోరారు.

నేడు మండల సమావేశం

వెల్దుర్తి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నేటి ఉదయం 10 గంటలకు ఎంపీపీ మిద్దె రంగయ్య ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుహాసిని తెలిపారు. అధికారులు, సర్పంచులు ప్రజాప్రతినిధులు నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి

- టీడీపీ నాయకుడు వైకుంఠం శివప్రసాద్


డైరెక్టర్లను సన్మానిస్తున్న నాయకులు

ఆలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జనసేన ఆలూరు ఇన్‌చార్జ్ తెర్నేకల్ వెంకప్ప అన్నారు. మంగళవారం పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో జనసేన ఆధ్వర్యంలో వాల్మీకి, కరువ కార్పొరేషన్ డైరెక్టర్లు ఉదయ్, మంజునాథ్‌లకు జనసేన కో ఆర్డినేటర్ బోయ రంజిత్ అధ్యక్షతన సన్మానించారు. వైకుంఠం శివప్రసాద్, వెంకప్ప మాట్లాడుతూ కలిసి పని చేద్దామని పిలుపు నిచ్చారు. వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్‌గా బుజ్జమ్మకు కురువ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఉదయ్, మంజునాథ్ నియా మకం అవ్వడం అభినందనీయమన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కురువ జయరాం, హాలహర్వి జడ్పీటీసీ కురువ లింగప్ప, టీడీపీ నాయకులు బెంగళూర్ కిషోర్, బాపురం నాగేంద్ర, బీమ్మప్ప చౌదరి, శినప్ప, నాగరాజు, గోవింద్, అన్వర్, చత్రపతి, శేఖర్, మున్న పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేయండి

- హంద్రీనీవా ద్వారా నీరందిస్తాం
- పనిచేసే అధికారులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే శ్యాంబాబు


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అందరం కలసికట్టుగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. మంగళవారం ఎంపీడీవో సర్దలత అధ్యక్షతన మండల సమావేశాన్ని నిర్వహించారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళి అర్పించి ప్రతిజ్ఞ చేశారు. పత్తికొండ పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే ట్రాన్స్‌కో సిబ్బందిపై ఫిర్యాదులు వస్తున్నాయని మరోసారి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ నారాయణస్వామి నాయక్‌ను హెచ్చరించారు. మండలానికి 5 సిజనల్ హాస్టళ్లు మంజూరయ్యాయని ఎంఈవో రమేష్ తెలిపారు. అపార్ నమోదు 75శాతం పూర్తిచేశామని తెలిపారు. పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయని విషయాన్ని తాను స్వయంగా తనిఖీల్లో గుర్తించానని మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. కాగా ఆపార్ జనన ధ్రువీకరణపత్రాల జారీ తలనొప్పిగా మారిందని జూటూరు కార్యదర్శి సాలెబొఖారియా ఎమ్మెల్యేకు తెలపడంతో అధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీవో వెంకటేష్, ఏవో వెంకట్రాముడు, ఏఈ వేణు, పనులను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి పాటుపడాలన్నారు. పత్తికొండ ప్రాంత ంలోని అన్ని గ్రామాలకు హంద్రీనీవా ద్వారా సాగునీరు ఇచ్చేందుకు కృషిచేస్తామన్నారు. పనిచేసే అధికారులు, ప్రజాప్రతినిధులకు రాజకీయాలకతీతంగా అండగా నిలుస్తామన్నారు.

స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు

- ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో రాజ్యంగ దినోత్సవం


ఆదోని ఆర్టీనగర్ ప్రాథమిక పాఠశాలలో నివాళి అర్పిస్తూ..

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ అన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండగిరి ఆర్టీనగర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మహదేవప్ప విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, విధులు ఉన్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పరిపాలన, ఎన్నికల వ్యవస్థను రాజ్యాంగం నిర్దేశిస్తుందని సూచించారు. మిల్టన్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు, వెంకటేష్ అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. గ్రంథాలయంలో అధికారి సుజాత, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సంజన్న, ఎన్ఎస్ఎస్ అధికారి గోవింద రాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పత్తికొండ టౌన్: విద్యుత్ కార్యాలయంలో ఏడీ ఖాజా వలి, ఏఈ నారాయణ స్వామి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు రంగస్వామి ఆధ్వర్యంలో న్యాయవాదులు అంబేద్కరకు నివాళి అర్పించి, ప్రతిజ్ఞ చేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో వేడుకలు అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.

దేవనకొండ: దేవనకొండ, తెర్నేకల్ జెడ్పీ పాఠశాలలు, తహసీల్దార్ కార్యాలయంలో జైభీమ్ అధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. తెర్నేకల్లులో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మద్దిలేటి, రోషన్న, సోమన్న, తదితరులు ఉన్నారు.

ఆలూరు: భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ పిలుపు నిచ్చారు. మంగళవారం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో గీతావాణి, సర్పంచ్ రాధమ్మ, జడ్పీటీసీ దొరబాబు, కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, సతీష కుమార్, ఏవో నరేంద్ర కుమార్ పాల్గొన్నారు

వెల్దుర్తి టౌన్: మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నూకల శ్రీను, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కర్ణ, మోహన్, మధుశేఖర్, గురుస్వామి, మనోహర్, మాధవస్వామి, రంగస్వామి, మధు, తదితరులు పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: సర్పంచ్ పెనికలపాటి వరలక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో మోహన్ కుమార్ నివాళి అర్పించారు. టీడీపీ ఉపాధ్యక్షుడు దామోదర్ నాయుడు, ఏపీఎం మహేష్ పాల్గొన్నారు.

మద్దికెర: సర్పంచ్ బండారు సుహాసిని, ఎం.అగ్రహారం పాఠశాలలో హెచ్ఎం ఆంజనేయులు నివాళి అర్పించారు. కార్యదర్శి శివకుమార్, సలహాదారులు బండారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: ఎంపీపీ ఎర్ననాగప్ప, ఈవోఆర్డీ శ్రీహరి, ఏపీవో హేమసుందర్ నివాళి అర్పించారు. జూనియర్ అసిస్టెంట్ రామబ్రహ్మం, ఎఫ్ఏలు పులికొండ, సతీష్, గిరిగిట్ల మల్లి, బలరాం, జయచంద్ర, వెంకటేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

హొళగుంద: కొత్తపేట ఎంపీపీ పాఠశాలలో హెచ్‌హెం వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థుల దేశ నాయకుల మాస్కులను ధరించారు.

పత్రికాస్వేచ్ఛను అడ్డుకోవడం మంచిది కాదు

- పట్టణ వైసీపీ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పత్రికాస్వేచ్ఛను అధికార పార్టీ నాయకురాలు అడ్డుకోవడం మంచిది కాదని వైసీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి హితవు పలికారు. మంగళవారం ద్వారకా హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో గరుసు అక్రమ తవ్వకాలపై వార్త రాసిన విలేకరిపై కేసు నమోదు చేయాలని డీఎస్పీకి ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. అక్రమాలు చేయలేదని నిరూపించుకోకుండా పోలీసులకు ఫిర్యాదు చేసి కలం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గరుసు అక్రమాలపై మైనింగ్ రెవెన్యూ అధికారులు విచారణ చేసి, ప్రజలకు నిజాలు తెలియజేసి, అక్రమార్కులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్, చలపతి, నాయకులు రామాంజి పాల్గొన్నారు.

వినతులను పరిష్కరిస్తాం

ఆదోని రూరల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సభలలో వచ్చిన వినతులను డిసెంబరు 31లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. మంగళవారం బైచిగేరిలో రీసర్వే పరిశీలించారు. డీటీ పెద్దయ్య, డీఐ వేణుసూర్య, సర్వేయర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

వీఆర్ఏల కమిటీ

ఆదోని రూరల్ నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషి చేసానని ఆ సంఘం మండల అధ్యక్షుడు రమేష్ తెలిపారు. మంగళవారం రెవెన్యూ భవన్‌లో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరేష్, ఉపాధ్యక్షుడిగా హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా ఈరన్న, కోశాధికారిగా కృష్ణతోపాటు మరో ఆరుమందిని కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

- అదుపులో నిర్వాహకురాలు, విటులు

పత్తికొండ, నవంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తి సర్కిల్‌లోని వ్యభిచార గృహంపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకురాలి తోపాటు మరో ఐదుగురిని అరెస్టు చేశారు. సీఐ జయన్న తెలిపిన మేరకు.. కోతిరాళ్ల గ్రామానికి చెందిన మహిళ బళ్లారి నుంచి మహిళలను పిలిపించి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు పత్తికొండ సీఐ జయన్న ఆధ్వర్యంలో ఎస్ఐ గోపాల్ సిబ్బంది మంగళవారం ఉదయం దాడులు నిర్వహించి బళ్లారికి చెందిన యువతితోపాటు ఐదుగురు విటులను అదుపులోకి తీసుకున్నారు. యువతికి ఐసీడీఎస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చి కర్నూలు హోంకు తరలించారు. యువతి ఇచ్చిన సమాచారం మేరకు నిర్వాహకురాలితో పాటు, విటులపై కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో మరి కొందరి పేర్లు వెల్లడయ్యాయని వారినికూడా అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో రోడ్లు

తుగ్గలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు మాజీ సర్పంచ్ ఫక్కీరప్ప అన్నారు. మంగళవారం కడమకుంట్లలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. వడ్డె శ్రీనివాసులు, శంకరయ్య, సురేష్ ఉన్నారు.

నీటి వృథాను అరికట్టాలి


చెరువు కట్టపై జెండా ఆవిష్కరిస్తున్న ఏపీవో హేమసుందర్

తుగ్గలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నీటి వృథాను అరికట్టి, అభివృద్ధికి పాటుపడాలని ఏపీవో హేమసుందర్ సూచించారు. మంగళవారం తుగ్గలి, పగిడిరాయి, రాతన, జి.ఎర్రగుడి, జొన్నగిరి తదితర గ్రామాల్లో చెరువుల ఆనకట్టలపై జాతీయ జెండా ఆవిష్కరించారు. ప్రతి నీటి బింధువును వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు. నీరుంటే గ్రామాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ఈసీ ప్రదీప్ కుమార్, టీఏలు రామాంజి, రామకృష్ణ, చంద్ర, జయరాం, ఫరీదప్ప, ఎఫ్ఏలు రాము, శ్రీనివాసులు, వెంకట్, పులికొండ, చంద్ర, రంగారెడ్డి తదితరులు ఉన్నారు

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కేవీ సుబ్బారెడ్డి

వెల్దుర్తి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, అప్పుడే వారి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ అన్నారు. మంగళవారం కార్యాలయంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు తహసీల్దార్, కేవీ సుబ్బారెడ్డి కళాశాల వ్యవస్థాపకుడు కేవీ సుబ్బారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ కోశాధికారి రఘునాథ్ చేతుల సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రెడ్‌క్రాస్ మాజీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రెడ్ క్రాస్ మండల అధ్యక్షులు కేపీ ఆచారి, పరమేష్, రాజ్యలక్ష్మి, శిక్షణ మహిళలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై కసరత్తు

ఆయా గ్రామాల నాయకులతో ఎమ్మెల్యే సమావేశం



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు డిసెంబరు 8 నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించటంతో ఎన్నికలపై ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఆయా గ్రామాల పార్టీ నాయకులతో సమావేశమై సమీక్ష నిర్వహించారు. వాస్తవంగా ఈనెలలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం గతంలో షెడ్యూలు విడుదల చేసింది. అయితే అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో డిసెంబరు 8న జరిపేందుకు చర్యలు తీసుకుంది. దీంతో ఓటర్ల జాబితను సైతం అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఎమ్మిగనూరు ఎల్లెల్సీ సబ్ డివిజన్ పరిదిలో 17 సాగునీటి సంఘాలు(డబ్ల్యూయూఏ) ఉన్నాయి. ఒక్కో సాగునీటి సంఘంలో 12 టీసీలు ఉంటాయి. మంగళవారం ఎమ్మెల్యే పట్టణంలోని కుర్ని కల్యాణ మండపంలో ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. మండలంలో ఆరు సాగునీటి సం ఘాల ఉండటంతో ఏ గ్రామం నుంచి ఎవరెవరు పోటీ చేయాలి అనేదానిపై నాయకులతో చర్చించారు. సమావేశంలో నాయకులు కడిమెట్ల విరుపాక్షిరెడ్డి, చెన్నారెడ్డి, కొండన్న గౌడ్, పార్లపల్లి మల్లికార్జున, నరసింహులు, భీమ, రాఘవేంద్ర, జగదీష్, గట్టు సలాంలతో పాటు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వం నమోదు చేసుకోండి




సభ్యత్వం నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

పెద్దకడబూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రూ వంద రూపాయలతో టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల వరకు ప్రమాద బీమా వర్తింసుందని టీడీపీ నాయకులు మీసేవ నరసప్ప, నరసింహులు అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కార్యకర్త మరణిస్తే తక్షణం మట్టి ఖర్చుల కింద రూ 10 వేలు అందించడంతో పాటు కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్ర, కురువ నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి నిజ బృందావన దర్శనం

మంత్రాలయం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. మంగళవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు.



నిజ బృందావనానికి హారతులిస్తున్న పీఠాధిపతి

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో 75వ భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం టీడీపీ నాయకులు కదిరికోట ఆదెన్న ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చార్లెస్, రోజా ఆర్ష్ ఉసేని, బంగారప్ప, చరణ్, ఈరన్న, నేపాల్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ ఆశయాలు అందరికీ ఆదర్శనీయం అని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, ఎంఈవో రామాంజినేయులు అన్నారు. మంగళవారం రాజ్యంగ దినోత్సవాన్ని మండలంలోని పలుపాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాయలంలో గ్రంథాలయంలో ఉన్నత పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుభాన్, అనిల్, న్యాయవాది చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, కరుణాకర్, మారేష్, పెద్దక్రైన్న, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడదామని ఎంఈవో సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు నందవరం హైస్కూల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. అనంతరం ఎంపీడీవో పుల్లయ్య అంబేడ్కర్, రాజేంద్ర ప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బసవరాజు, ఎల్లప్ప, పరమేష్, పార్వతి, ప్రసాద్, శేఖరప్ప, శివరామ్, ప్రమిల, విజయలక్ష్మీ, ఉరుకుంద పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలో మంగళవారం భారత దేశ రాజ్యాంగ దినోత్సవాన్ని దళిత సంఘాలు, పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. కౌతాళంలోని వెలుగు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దళిత సమైక్య సంఘం వ్యవస్థాపకుడు కట్టా స్వామిదాసు, దళిత సంఘం నాయకులు విజయ్ కుమార్, ప్రకాష్, తిమోతీ పాల్గొన్నారు.

మంత్రాలయం: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ ఆశయాల తోనే దళితులు అభివృద్ధి చెందుతారనీ జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య అన్నారు. మంగళారం 75వ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని మంత్రాలయం మాధవరం, రచ్చుమరి, తహసీల్దార్, ఎంపీడీవో, కస్తూర్బా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు హంపయ్య, బోజరాజు, లచ్చప్ప, రవి, ప్రభావతి దేవి, శాంతిలు డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాగసుధ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముత్తు సుమాల, రాష్ట్ర అధ్యక్షులు గర్జి హనుమన్న, ప్రశాంత్ కుమార్, సత్యన్న, రత్నం, యోహాన్, అనీల్ కుమార్, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో..



కౌతాళంలో..



ఎమ్మిగనూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



నందవరంలో విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఎంఈవో



మంత్రాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

పత్తి రైతు పాట్లు..

- విక్రయానికి రెండు రోజులైనా ఆగాల్సిందే
- ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికుల ఇబ్బందులు

నందవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పత్తి దిగుబడి బాగానే ఉండడంతో పత్తి మిల్లులు, వ్యాపార అంగళ్లు కిటకిటలాడుతున్నాయి. దీంతో మిల్లులకు పత్తిని తీసుకు వచ్చిన రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రోజుకు వందలాది పత్తి వాహనాలు మిల్లు ముందు బారులు తీరుతున్నాయి. రెండు రోజులైన మిల్లులోకి వాహనాలు పోలేని పరిస్థితి నెలకొంది. ఎకరాకు తొమ్మిది నుంచి 14 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావడం, ధర కూడా క్వింటం రూ. ఏడు వేలు పలుకుతుండడంతో రైతులు పత్తిని విక్రయించేందుకు తీసుకవసున్నారు. మరో పక్క రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఆపుతుండడంతో ట్రాఫిక్ అంతరాయంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మిల్లుల వద్ద వాహనాలు నిలుపుకునేందుకు స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు నిలుపుకోవాల్సి వస్తోంది. హైవే రోడ్డుపై ప్రయాణికులు, వాహనాలతో నిత్యం రోడ్డు రద్దీగా ఉంటుంది. రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా మిల్లు యాజమానులు వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని రైతులు కోరుతున్నారు.



ముగతి సమీపంలో బారులు తీరిన పత్తి వాహనాలు

తొమ్మిది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది

ఈ యేడాది పత్తికి ఎర్రతెగులు వచ్చింది. అయినా ఎకరాకు తొమ్మిది క్వింటాల పత్తి దిగుబడి వచ్చింది. ఒక్కరోజంతా రోడ్డ మీద నిలబడి క్వింటం రూ. 6900 ప్రకారం మిల్లులో అమ్ముకున్నా. టోకన్ ఇచ్చి మిల్లు ప్రాంగణంలో వాహనాలు నిలుపుకునే విధంగా మిల్లు యాజమానులు చూడాలి.



\- ఉసేని, రైతు, ముగతి

అంబేడ్కర్ పాటల సీడీ ఆవిష్కరణ

మంత్రాలయం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాగసుధ అతిథి గృహంలో జయహో అంబేడ్కర్ అను పాటను జానయ్య రచించిన సీడీని గేయాల పాటలను కోసిగి జైభీమ్ మండల అధ్యక్షులు వికలాంగుడు రాజేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మంగళవారం మంత్రాలయం నియోజకవర్గం, కర్నూలు జిల్లా నుంచి వచ్చిన జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించిన అంశాలపై పాడిన గేయాలను ఆవిష్కరించిన సీడీలను అందజేశారు. కార్యక్రమంలో గర్జి హనుమన్న, అనీల్, యోహన్, రత్నం, రాజు పాల్గొన్నారు.



జయహో అంబేడ్కర్ సీడీని ఆవిష్కరిస్తున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

రూ.5కోట్లతో తాగునీటి పైప్‌లైన్: కమిషనర్

ఎమ్మిగనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారుప్రాంతాల్లో ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ. 5కోట్లతో పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పట్టణంలో శివారుకాలనీలపై చిన్నచూపు అనే శీర్షిక ప్రచురితం కావడంతో కమిషనర్ స్పందించారు. కాలనీల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. శాశ్వత పరిష్కారం కోసం 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆయా ప్రాంతాల్లో త్వరలో పైప్‌లైన్‌పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే పట్టణంలోని మార్కెట్ కమిటీ సర్కిల్ నుంచి శ్రీనివాస సర్కిల్, నీలకంటేశ్వర గుడి, షరాఫ్ బజార్ మీదుగా కలుగొట్ల రోడ్డు చర్చివరకు బీటీ రోడ్డును రూ. 3.50కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేగాక పట్టణంలోని ట్యాంక్ బండ్ రోడ్డు, శ్రీనివాస సర్కిల్, శిల్పా ఏస్టేట్, ఎద్దుల మార్కెట్, గోనెగండ్ల సర్కిల్ మీదుగా సున్నం బట్టి ప్రాంతం వరకు రూ. 54లక్షలతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే ఈ పనులు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జికి వినతి పత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

మంత్రాలయం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బడుగు, బలహీన వర్గాలకు వైద్య సేవలు అందించే 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డిని కోరారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలో రాఘవేంద్రరెడ్డిని కలిసి 104 ఉద్యోగుల సంఘం నాయకులు పెద్దయ్య, రామాంజనేయులు, వెంకటేశ్ కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని కోరారు. జీతాలు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఇబ్బందిగా మారిందన్నారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి ఇన్సూరెన్స్ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో 104 ఉద్యోగ సంఘం నాయకులు రాజు, దేవప్ప, సురేష్, విజయ్, అయ్యప్ప, అశోక్ పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఈవోఆర్‌డీ అనంతశయన, మేజర్ పంచాయతీ కార్యదర్శి సతీష్ ఆదేశించారు. మంగళవారం గోనెగండ్లలోని చెత్తసంద కేంద్రాన్ని పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్తలను వేరుగా చేసి వర్మీకంపోస్టు తయారు చేయాలని, దీంతో పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో పారిశుధ్య పనులు తరితగతిన చేయాలని డ్రైనేజీలు శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హైమావతి, అనిల్, పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుభాన్, సిబ్బంది పాల్గొన్నారు.



పంచాయతీ సిబ్బందికి సూచనలిస్తున్న ఈవోఆర్‌డీ

'అదానీని తక్షణమే అరెస్టు చేయాలి'

ఎమ్మిగనూరు టౌన్,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అదానీని అరెస్టు చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఎం సత్యన్న డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మూడోసారి అధికారంలో వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, పేద ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, బాబు, ఎల్లప్ప, నరసింహులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు: టీడీపీ

నందవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీని నమ్ముకుని పని చేసిన ప్రతి ఒక్కరికి పదవులు వస్తాయని టీడీపీ సీనియర్ నాయకులు, కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ డైరెక్టర్ సోమలగూడురు వెంకట్రామిరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించి వారికి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. అందులో భాగంగా ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి పీఏసీలో కమిటీ సభ్యులుగా, కర్నూలు సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు కుడా చైర్మన్ పదవులు దక్కాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రజక సంఘం నాయకులు చంద్ర, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం'

కౌతాళం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు జగదీష్, మండల కార్యదర్శి నాగేంద్రలు అన్నారు. కౌతాళంలో మంగళవారం సంఘం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధనాలకు వత్తాసు పలుకుతూ పేదల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు కార్మికులకు అందించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని వీరందరికీ పెన్షన్, గ్రాట్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, ఖాదర్, అక్రమ్, ఎల్లప్ప, ఈరన్న, బసవలు పాల్గొన్నారు.